# పాడికి నష్టం కలిగించే ముఖ్యమైన వ్యాధులు

**పాడి పశువుల్లో సోకే వ్యాధుల్లో అంటువ్యాధులు, ఇతర వ్యాధులు ఉన్నాయి. అంటువ్యాధులు అనగా సూక్ష్మజీవులు, పశువులో ప్రవేశించి వ్యాధిని కలిగించి మలమూత్రాల ద్వారా, గాలి, నీటి ద్వారా, గడ్డి గాదం ద్వారా ఒక పశువు నుండి వేరొక పశువుకు వ్యాపిస్తాయి. వాటిలో 'వైరస్' సూక్ష్మజీవుల వలన కలిగే వ్యాధి గాలికుంటు వ్యాధి. 'బాక్టీరియా' సూక్ష్మజీవుల వలన కలిగే వ్యాధులలో గొంతువాపు, జబ్బవాపు ముఖ్యమైన వ్యాధులు.**

**గాలికుంటు వ్యాధి :** సంకరజాతి పశువుల్లో ఈ వ్యాధి తీవ్రత, దేశవాళి పశువుల్లో కన్నా ఎక్కువగా ఉంటుంది. దేశవాళి పశువుల్లో ప్రాణనష్టం అంతగా ఉండదు. ఎద్దులు సరిగా పనిచేయవు. మార్చి, ఏప్రిల్, ఆగస్టు, సెప్టెంబరు మాసాలలో ఈ వ్యాధి ఎక్కువగా వచ్చును. ఈ వ్యాధి సూక్ష్మాతి సూక్ష్మజీవుల (వైరస్) వలన సంక్రమిస్తుంది. వ్యాధి సోకిన ఆవులు, గేదెల పాలద్వారా దూడలకు వ్యాపిస్తుంది.



**వ్యాధి లక్షణాలు :** నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి, 3, 4 వారాల్లో బొబ్బలు చితికి, పుండ్లుగా మారి చర్మము గరుకుగా తయారవుతుంది. పశువుల నోటిలో, చిగుళ్ళపై పొక్కులు ఏర్పడటం చేత పశువులు మేత, నీరు తీసుకోక నీరసించి పోతాయి. నోటి నుండి చొంగకారుతూ ఉంటుంది. పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. వ్యాధి పీడిత ఆవులు, గేదెల పాలు తాగిన దూడలు మరణిస్తాయి. జ్వరతీవ్రత 104 - 106 డిగ్రీల ఫారన్‌హీట్‌కు పెరిగి పశువులు నీరసించిపోతాయి. గిట్టలలో పుండ్లు ఏర్పడటం వలన ఎద్దులు వ్యవసాయ పనులు చేయలేవు.

**చికిత్స :** కాలిగిట్టల మధ్య పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, ఈగలు వాలకుండా నీమెలెంట్, వేపనూనె పూయాలి. నోటిలోని పుండ్లకు బోరిక్ పౌడర్, గ్లిసరిన్ కలిపి పూయాలి. డాక్టరును సంప్రదించి అవసరమైన మందులు వాడాలి.

**నివారణ :** వ్యాధి సోకిన పశువులను వేరుచేయాలి. పశువుల పాకలను క్రిమిసంహారక మందులతో, వాషింగ్‌సోడాతో కడగాలి. వ్యాధి సోకిన పశువుల మలమూత్రాలను గడ్డితో కాల్చి వేయాలి. చనిపోయిన పశువును సున్నపు గోతిలో పూడ్చాలి. వ్యాధిసోకిన పశువుల పాలను దూడలకు త్రాగించకూడదు. మార్చి లేదా ఏప్రిల్, ఆగస్టు లేదా సెప్టెంబరు మాసాలకు ముందుగా వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా ఇప్పించాలి.

**గొంతువాపు వ్యాధి :** వర్షాకాలంలో ఈ వ్యాధి ఎక్కువగా దున్నలు, గేదెలలో వస్తుంది. నీరసంగా ఉన్న పశువులకు ఈ వ్యాధి త్వరగా సోకుతుంది. పల్లపు ప్రాంతాలలో, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లోని పశువుల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధిని 'గురక వ్యాధి' అని కూడా పిలుస్తారు. ఒక రకమైన సూక్ష్మజీవి (బాక్టీరియా) వలన ఈ జబ్బు పశువులకు సంక్రమిస్తుంది. ఆలసిపోయిన, బలహీనంగా ఉన్న పశువులకు ఈ వ్యాధి త్వరగా వస్తుంది.

**వ్యాధి లక్షణాలు :** పశువు ఆయాసపడుతూ శ్వాస పీలుస్తుంది. శ్వాస పీల్చేటప్పుడు, గురు గురు మని శబ్దం వస్తుంది. నాలుక బయటకు తీస్తూ, శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. పశువు 24 గంటలలో చనిపోతుంది. గొంతు పైభాగాన, మెడ క్రింద వాపు ఉంటుంది. కళ్ళు ఎర్రబడి నీరు కారుతూ ఉంటాయి. జ్వరతీవ్రత 104 - 106 డిగ్రీల ఫారన్‌హీట్‌కు పెరిగి పశువు చనిపోతుంది.

**చికిత్స :** పశువైద్యుని సలహాను పాటించి పశువులకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలి. వ్యాధి సోకిన వాటికి యాంటీబయోటిక్స్, ఇతర మందులు డాక్టరు సలహా ప్రకారం వాడాలి. వ్యాధి ముదిరిన తరువాత చికిత్సకు ఫలితం ఉండదు.

**నివారణ :** వర్షాకాలం ముందు మే, జూన్, మాసాలలో వ్యాధినిరోధక టీకాలు వేయించాలి. పుష్టికరమైన ఆహారమివ్వాలి. ఎందుకనగా బలహీనంగా ఉన్న పశువులు త్వరగా వ్యాధికి గురవుతాయి. వ్యాధి సోకిన పశువులను మంద నుండి వేరు చేయాలి. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి. చనిపోయిన పశువును సున్నపు గోతిలో పూడ్చాలి.

**జబ్బవాపు వ్యాధి :** ఆరోగ్యంగా, బలంగా ఉండే పశువుల్లో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి తొలకరి చినుకులు పడ్డ తరువాత వస్తుంది. సాధారణంగా ఉష్ణ ప్రాంతాలలోను, గాలిలో తేమ ఎక్కుగా ఉండే ప్రాంతాలలో

ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. ఈ వ్యాధి ఎక్కువగా తెల్లజాతి పశువులలో వస్తుంది. ఒక రకమైన సూక్ష్మజీవి (బాక్టీరియా) వలన ఈ జబ్బు పశువులకు సంక్రమిస్తుంది. కలుషితమైన ఆహారం, నీరు ద్వారా ఈ వ్యాధి త్వరగా వ్యాపిస్తుంది.

**వ్యాధి లక్షణాలు :** 6 మాసాల నుండి 2 సంవత్సరాల లోపు వయసుగల, బలంగా ఆరోగ్యంగా ఉన్న పశువులలో ఈ వ్యాధి ఎక్కువగా వస్తుంది. చిన్న పశువులు అకస్మాత్తుగా మరణిస్తాయి. చాలా సందర్భాలలో వ్యాధి లక్షణాలను గుర్తించక ముందే పశువులు మరణిస్తాయి. జబ్బ, తొడ కండరాలపైన వాపు కనబడుతుంది. ముందుగా వాపు ఉన్నచోట వేడిగాను, నొప్పిగాను ఉంటుంది. వాపు ఉన్నచోట తాకిన కరకరమని శబ్దం వస్తుంది. పశువు నీరసంగా ఉండి ఆకలి మందగిస్తుంది. జ్వర తీవ్రత 104 - 106 డిగ్రీల ఫారన్‌హీట్‌కు పెరిగి పశువు చనిపోతుంది. ముందు కాళ్ళ మధ్యలో కూడా వాపు రావచ్చు. ఒకటి కంటే ఎక్కువ శరీర భాగాలలో వ్యాధి లక్షణాలు కనిపించి 12-36 గంటలలో పశువు మరణిస్తుంది.

**చికిత్స :** పశువులలో వ్యాధి లక్షణాలు కనపబడిన వెంటనే డాక్టరును సంప్రదించి, పెన్సిలిన్ మరియు ఇతర యాంటీబయాటిక్ మందులు ఇప్పించాలి.

**నివారణ :** వర్షాలకు ముందే వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించాలి. వ్యాధి సోకిన పశువుల మలమూత్రాలను, గడ్డిని కాల్చివేయాలి. చనిపోయిన పశువును సున్నపు గోతిలో పూడ్చాలి.

పాడి పశువులలో తరచుగా వచ్చే ముఖ్యమైన ఇతర వ్యాధులలో - మొదటిగా పొదుగు వ్యాధి, పాలజ్వరం, ఈసుకు పోవడం. ఇవి రైతుకు తీవ్ర ఆర్థికంగా నష్టం కలిగిస్తాయి.



**పొదుగు వాపు వ్యాధి (మ్యాస్టైటిస్) :** ఈ జబ్బు పాల ఉత్పత్తి ఎక్కువగా ఉన్న పశువులలో మరియు సంకరజాతి పశువులలో వచ్చును. ఈ జబ్బు సోకిన పశువులలో పాల ఉత్పాదకశక్తి తగ్గుతుంది. ఈ వ్యాధి పాలిచ్చే పశువులలో ఏ సమయంలోనైనా సోకి రైతుకు నష్టం కలిగిస్తుంది. పాలు పితికేటప్పుడు గోటితో కలిగే పుండ్లు, దూడ కొరుకుడు పుండ్ల ద్వారా సూక్ష్మజీవులు పొదుగులోకి ప్రవేశించి పొదుగువాపు కలుగజేస్తాయి. పొదుగుకు చిన్నదెబ్బ కలిగినా ఈ వ్యాధి వస్తుంది. మురికిగా ఉండే చేతితో పాలు పితకడం వలన మరియు అపరిశుభ్రమైన పరిసరాలలో పాలు పితకడం వలన, ఇతర జబ్బుల వల్ల కూడా పొదుగువాపు వస్తుంది.

**వ్యాధి లక్షణాలు :** వ్యాధి సోకిన ఆవులు, గేదెల యొక్క పొదుగు, చన్నులు వాచి ఉంటాయి. పొదుగు మరియు చన్నులు ముట్టుకుంటే వేడిగా ఉండి నొప్పితో పశువు బాధపడుతూ ఉంటుంది. పొదుగు గట్టిగా ఉంటుంది. పొదుగువాపు ఒక చన్నుకుగాని, అంతకన్నా ఎక్కువ వాటికి గాని ఒకేసారి రావచ్చు. పాలు పితికినప్పుడు పాలలో పలుకులు లేక నీళ్ళవలే ఉండి పశువు కొద్దిగా పాలు ఇస్తుంది. ఒక్కోసారి పాలధారలలో రక్తచారలు కనపడతాయి. పశువు జ్వరంతో బాధపడుతూ మేత మేయక నీరసంగా ఉంటుంది.

**చికిత్స :** పశువైద్యుని వీలైనంత త్వరగా సంప్రదించి యాంటీబయోటిక్ మందులతో చికిత్స చేయించాలి. వ్యాధిని గుర్తించి, చికిత్స ఎంత త్వరగా ప్రారంభిస్తే, ఫలితాలు అంత బాగుంటాయి.

**నివారణ :** పాకలను పరిశుభ్రంగా ఉంచి, వీలైనంత పొడిగా ఉంచాలి. పాడి పశువులను పరిశుభ్రంగా ఉంచాలి. పాలు పితికే ముందు పొదుగును గోరువెచ్చని నీళ్ళతో కడిగి శుభ్రమైన గుడ్డతో తుడవాలి. పాలు పితికేవారి చేతులకు గోళ్లు లేకుండా శుభ్రంగా ఉండాలి. పొదుగులో పాలు లేకుండా మొత్తం పితికివేయాలి. ఈనిన పశువుల మానం నుండి కారే చీము, రక్తం, స్రావాలు పొదుగును తాకకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరచాలి.

**పాల జ్వరం (మిల్క్ ఫీవర్) :** ఈ జబ్బు ఆవులలో, గేదెలలో ఈనిన మొదటి వారంలోనే వస్తుంది. అధిక పాల ఉత్పత్తినిచ్చే సంకరజాతి పశువులకు ఈ జబ్బు ఎక్కువగా వస్తుంది. ఈనిన వెంటనే పాలు పిండుట వలన కూడా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధి కాల్షియం లోపం వల్ల కలుగుతుంది. జున్నుపాలు, సాధారణ పాలలో పశువుల శరీరంలోని కాల్షియం ధాతువు లోపించడం వలన, పశువు



ఈనిన తరువాత ఈ వ్యాధి కలుగుతుంది.

**వ్యాధి లక్షణాలు :** పశువు తల, మెడ ఒక వైపుకు తిరిగి తలను డొక్కలో పెట్టుకొని పడుకుంటుంది. నీరసంతో మేత మెయ్యవు. ఈ వ్యాధి సోకిన పశువులలో క్రిందపడిపోవుట, తన్నుకొనుట, కండరాలు వణుకుట వంటి లక్షణాలు కనబడతాయి. కళ్ళ నుండి నీరు కారుతూ, చెవులు వాలి ఉంటాయి. కొన్ని పశువులలో చూపు మందగించవచ్చు. పశువు చిరాకుగా ఉండి ఉలికిపడుతుంది.

**చికిత్స :** డాక్టరును వీలైనంత త్వరగా సంప్రదించి కాల్షియం ఇజక్షన్లు ఇప్పించాలి. అశ్రద్ధ చేసిన, జబ్బు ప్రమాదకరంగా మారి పశువులకు తీరని నష్టం కలుగజేస్తుంది.

**నివారణ :** ఈనిన వెంటనే పొదుగును శుభ్రపరచవలెను. ఈనిన వెంటనే పొదుగు నుండి మొత్తం పాలు పితకకూడదు. పశువు చూడితో ఉండగానే లేక ఈనిన తరువాత కాల్షియం, మెగ్నీషియం, ఖనిజ లవణాలు డాక్టరుతో సంప్రదించి సరైన మోతాదులో ఇప్పించాలి.

**ఈసుకు పోవడం :** దీనినే బ్రూసెల్లోసిస్ అంటారు. ఈ వ్యాధి బాక్టీరియా ద్వారా కలుగుతుంది. పశువుల నుండి మనుషులకు వ్యాధి సంక్రమిస్తుంది. సూక్ష్మజీవులు నోటి ద్వారా, చర్మం ద్వారాగాని, పొదుగు ద్వారాగాని ప్రవేశిస్తాయి. గర్భకోశం నుండి స్రవించే మట్టు ద్వారా కూడా వ్యాప్తి చెందుతుంది.

**వ్యాధి లక్షణాలు :** మేత సరిగ్గా మేయక పాల దిగుబడి తగ్గిపోతుంది. 4-9 నెలల చూడి దశలో పశువులు ఈసుకుపోతాయి. కీళ్ళ వాతం వచ్చి పశువులు కుంటును.

**చికిత్స :** డాక్టరును సంప్రదించి యాంటిబయోటిక్ మందులతో చికిత్స చేయించాలి.

- డి. సుధీర్, ఎమ్. ప్రభాకర్,
సి.హెచ్. శ్రీనివాసరావు,
కృషి విజ్ఞాన కేంద్రం, రంగారెడ్డి జిల్లా,
కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, హైదరాబాద్